క్లుప్తంగా

ప్రవేశ పరీక్షల్లో రాణించిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ డి.సునీత తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఆమె అభినందించారు. కేంద్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన రసాయన శాస్త్ర ప్రవేశ పరీక్షలో దొమ్మేటి విజయ్‌కుమార్ 113 మార్కులతో సీటు సాధించాడు. ఏపీపీజీఈ సెట్‌లో గణిత శాస్త్రంలో జొన్నాడ నాగసత్యవేణి 20, మాతూరి సూర్య 112, రసాయన శాస్త్రంలో విజయ్‌కుమార్ 25, జంతుశాస్త్రంలో ముంజరపు మౌనిక 315, రాజనీతిశాస్త్రంలో మోస దావీద్‌రాజు 443 ర్యాంకులు, ఐసెట్‌లో షేక్ బేబీఫాతిమా 32,136 ర్యాంక్‌లు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చెన్నారావు, వెంకటేశ్వరరావు, ప్రయాగమూర్తి, సురేష్,రామారావు, మదీనా పాల్గొన్నారు.

ఆలయానికి పూజా సామగ్రి సమర్పణ



హనుమాన్ ఆలయానికి పూజాసామగ్రిని అందజేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని హనుమాన్ ఆలయానికి మంగళవారం పూజాసామగ్రిని అందజేశారు. స్థానిక వైఆర్‌సీ కార్యాలయాల సమీపంలోని హనుమాన్ ఆలయానికి పూజాసామగ్రి అందజేశారు. అనంతరం పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో మహిళలు హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామార్చన, భజన కాలక్షేపం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాలయం అభివృద్ధికి తమ వంతు సహాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు తూమురొతు గురయ్య, ఉడతల రమణారావు, మల్లేశ్వరి, కుమారి, ఇందిరా పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు



గోకవరంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు

గోకవరం: నూతనంగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని గోకవరం ఎస్సై కె.నాగరాజు అన్నారు. గోకవరంలో స్థానిక కేవీఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం కొత్త క్రిమినల్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. క్రిమినల్ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండటం ద్వారా నేరాల బారిన పడకుండా ఉండటానికి అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేవీఎస్ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం


తుని: పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట్రావు మంగళవారం తెలిపారు. అనంతరం రామకృష్ణ కాలనీలోని జ్యోతి నగర్‌లో అభివృద్ధి పనులను ఎమెల్యే యనమల దివ్యతో కలిసి చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభిస్తారన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు

కొత్తపల్లి: ఉప్పాడ- పిఠాపురం రోడ్డుపై వాహనాల వేగాన్ని నిరోధించే విధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాకతిప్పలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వేగంగా దూసుకువెళుతున్న వాహనాల కారణంగా ప్రజలు, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాకతిప్ప ఎంపీపీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు యూనియన్ బ్యాంకు వద్ద తరచూ రోడ్డు దాటి పాఠశాలకు వెళుతున్నారు. ఏ వైపు నుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకుకు వెళ్లే ఖాతాదారులు రోడ్డు దాటే సమయంలో భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లే రోడ్డు ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రక్షిత నీటి పథకానికి కరెంట్ కష్టాలు

- తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- భావవరం ఫిల్టర్ బెడ్స్‌కు చేరని నీరు
- 41 గ్రామాల్లోని 1.50 లక్షల మందికి సక్రమంగా అందని తాగునీరు
- భావవరంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం డిమాండ్



భావవరం వద్ద ఏలేరు రిజర్వాయర్ నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన ఇన్‌టేక్‌వెల్


జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గంలోనే అతి పెద్దదైన భావవరం వద్ద ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని కరెంట్ కష్టాలు చుట్టుముట్టాయి. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోని 41 గ్రామాల్లో 1.50 లక్షల మందికి నిత్యం 35 లక్షల కిలో లీటర్ల నీటిని ఈ పథకం ద్వారా సరఫరా చేస్తారు. భావవరం సమగ్ర రక్షిత మంచినీటి పథకానికి తరచు విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోతోంది. దీనివల్ల 41 గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందడం లేదు. జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో ప్రజలకు గతంలో ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీరు అందించే వారు. ఈ ప్రాంతాల్లో సుద్ద ఎక్కువగా ఉండడం, కొన్ని చోట్ల ఫ్లోరోసిస్ శాతం స్థాయిని మించి ఉండడంతో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనేవారు. ఈ నేపథ్యంలో భావవరం గ్రామ సమీపంలోని ఏలేరు రిజర్వాయర్ నీటిని తోడి, దాన్ని శుద్ధిచేసి ప్రజలకు తాగునీరుగా సరఫరా చేయాలని అప్పటి నేతలు ఆలోచన చేశారు. దీనితో భావవరం వద్ద సమగ్ర రక్షిత మంచినీటి పథకం ఏర్పాటైంది.

2011లో భావవరం ఫిల్టర్ బెడ్ల నిర్మాణం

2011లో రూ.10 కోట్లతో భావవరం వద్ద సమగ్ర రక్షిత మంచినీటి పథకం (ఫిల్టర్ బెడ్స్) ఏర్పాటు చేశారు. ఏలేరు జలాలు తోడేందుకు ఇన్‌టేక్ వెల్ భావవరం అటవీ ప్రాంతంలో ఏలేరు రిజర్వాయర్ నీరు లభించే చోట నిర్మించారు.ఇన్‌టేక్ వెల్ ద్వారా రోజుకు 35 లక్షల కిలో లీటర్ల నీటిని 16 గంటల పాటు ఏకధాటిగా తోడి శుద్ధి చేసి రెండు మండలాల ప్రజలకు సరఫరా చేస్తారు. నీరును తోడేందుకు 30 హెచ్‌పీ మోటార్లు రెండు, 40 హెచ్‌పీ మోటార్లు రెండు ఏర్పాటు చేశారు. 30 హెచ్‌పీ ఒకటి, 40 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేశారు. షిఫ్టుకు రెండు మోటార్లను వినియోగించి 8 గంటలకు ఒకసారి నీటిని తోడుతాయి. ఈ నీరు ఏలేరు నుంచి 4 కిలోమీటర్లు దూరంలో భావవరం వద్ద ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్స్ వద్దకు చేరుకుంటుంది అక్కడ శాస్త్రీయ పద్ధతిలో నీటిని శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా 41 గ్రామాలకు తరలిస్తారు. ఈ నీరు 41 గ్రామాల్లోని 35 ఓవర్ హెడ్ ట్యాంకులు, 29 జీఎల్ ఆర్‌లకు చేరుతుంది. అక్కడి నుంచి గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

విద్యుత్ అంతరాయాలతో పనిచేయని ఇన్‌టేక్ వెల్

ఏలేరు వద్ద ఏర్పాటు చేసిన ఇన్‌టేక్ వెల్‌కు జగ్గంపేట మండలంలోని రాజపూడి విద్యుత్ సబ్ స్టేషన్ 11 కేవీ విద్యుత్ లైను వేశారు. రాజపూడి నుంచి ఇన్‌టేక్ వెల్‌కు 12 కిలోమీటర్లు దూరం ఉంది. రాజపూడి నుంచి ఇన్‌టేక్ వెల్‌కు వెళ్లే 11 కేవీ విద్యుత్ లైను అటవీ ప్రాంతం, కొండ ప్రాంతం, తోటలు, తుప్పలు, వెదురు గుబుర్ల మధ్య, నుంచి 5 గ్రామాల మీదుగా ఉంది. దీనితో చిన్న గాలి వేసినా, వర్షం కురిసినా చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడం, తీగలు తెగిపోవడం, లేదా ట్రిప్ అవ్వడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యుత్ సరఫరా ఆగిపోతే పునరుద్ధరించడానికి సుమారుగా 6 నుంచి 10 గంటల సమయం పడుతోంది. ఈ మధ్య మూడు రోజులు పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 41 గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు అడవి పందుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారు. అడివి పందులు విద్యుత్ షాక్‌కు గురైనప్పుడు లైను ట్రిప్ అవుతోంది. దీంతో విద్యుత్ సిబ్బంది రాత్రి సమయంలో లైన్ల పునరుద్ధరణకు వెళ్లడానికి విద్యుత్ తీగలుంటాయని భయపడుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారుల దృష్టి సారించాల్సి ఉంది.



భావవరం వద్ద ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు



విద్యుత్ తీగలకు తగులుతున్న వెదురుచెట్లు

అధికారుల లెక్కల ప్రకారం భావవరం సమగ్ర రక్షిత మంచినీటి పథకానికి మూడు విద్యుత్ సర్వీసులుండగా 342 హార్స్ పవర్ ఉపయోగిస్తున్నారు. ఏడాదికి కరెంట్ బిల్లుగా 1.10 కోట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంట్ చెల్లిస్తోంది.

విద్యుత్ సరఫరా సక్రమంగా లేక నీటి విడుదలలో అంతరాయం



భావవరం సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో ఎలాంటి లోపం లేదు. ఇన్‌టేక్ వెల్ ద్వారా నీరు తోడాలంటే మోటార్లు తిరగాలి, దానికి కరెంట్ కావాలి. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కారణంగా సమస్య వస్తోంది. అంతరాయం లేకుండా అధికారులు విద్యుత్ సరఫరా చేసేలా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలి. తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సహకరించాలి.

– రాంజీ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, జగ్గంపేట

జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నాం



రాజపూడి నుంచి ఏలేరు వద్ద వున్న ఇన్‌టేక్‌వెల్ (పంపింగ్ జరిగే ప్రాంతం) వరకూ ఏర్పాటు చేసిన విద్యుత్ లైను ప్రాంతంలో తరచూ జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నాం. 5 గ్రామాలకు చెందిన లైన్‌మెన్లు పర్యవేక్షిస్తున్నారు. చిన్నగాలి వేసినా, వర్షం కురిసినా చెట్టు కొమ్ములు తగిలి లైను ట్రిప్ అవుతోంది. లైన్లు తెగిపోతున్నాయి.

– ఎ.శ్రీను, విద్యుత్ శాఖ ఏఈ, జగ్గంపేట

ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



41 గ్రామాల్లోని 1.50 లక్షల మందికి తాగునీరు అందించే పథకం తరచూ పనిచేయకపోవడం బాధాకరం. విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉండేందుకు భావవరం వద్ద ప్రత్యేక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల ఆటంకం లేకుండా భావవరం ఫిల్టర్ బెడ్స్‌కు 24 గంటలు విద్యుత్ సరఫరాతోపాటు గ్రామాల్లో లో వోల్టేజి సమస్యలుండవు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి ఈ సమస్యను అనేక సార్లు తీసుకువెళ్లాం.

– కర్నాకులు వీరాంజినేయులు, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పత్తిలో అంతర పంటగా ఉల్లి సాగు



ఎన్.చామవరంలో పత్తిలో అంతర పంటగా సాగవుతున్న ఉల్లి

తుని రూరల్: పలువురు రైతులు పత్తిలో అంతర పంటగా ఉల్లి సాగు చేస్తున్నారు. ఇప్పటికే స్వల్పకాలంలో చేతికి అందే దేశవాళి రకం ఉల్లి విత్తనాన్ని వేసిన రైతులు రెండు వారాలు వ్యవధిలో పత్తి విత్తనాలు విత్తారు. ఆరు నుంచి ఎనిమిది వారాల్లో ఉల్లి పంట చేతికి అందుతుందని రైతులు పేర్కొన్నారు. ఉల్లి పంటను తీసివేసిన తర్వాత పత్తిలో దుక్కులు చేసి ఎరువులు అందిస్తామన్నారు. ఆ తర్వాత పత్తిలో పూత, పిందె, కాయలు వస్తాయన్నారు. మండలంలో ఎన్.చామవరం, వి.కొత్తూరు, హంసవరం, టి.తిమ్మాపురం, గవరపేట తదితర గ్రామాల్లో 110 ఎకరాల్లో రైతులు ఇలా పత్తిలో ఉల్లి సాగు చేస్తున్నారు. మెలకువలతో అంతర పంటలు సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ తెలిపారు. పత్తిచేల గట్లపై కంది, బంతి పూలు, బెండ విత్తనాలు అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చన్నారు.

జగ్గంపేటలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

జగ్గంపేట: వారం రోజుల పాటు కొనసాగే జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం జగ్గంపేటలో ప్రారంభమయ్యాయి. సీరపు రాజశేఖరరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పేరిట ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. దివంగత సీరపు రాజశేఖరరెడ్డి మిత్ర బృందం, జేవీయర్ గ్రూప్స్ అధినేత జీనుమణిబాబు, బాలాజీ రెస్టారెంట్ అధినేత బాలురెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. జిల్లాకు చెందిన 32 టీములు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని జీనుమణిబాబు తెలిపారు. క్రికెట్ పోటీలు బాలాజీ రైసు మిల్లు ఎదురుగా గుర్రంపాలెం రోడ్డులో నిర్వహిస్తున్నారు. ప్రథమ బహుమతిగా రూ.22,222, ద్వితీయ బహుమతి రూ.15,555, తృతయ బహుమతిగా రూ.5,555 విజేతలకు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ఏలేశ్వరం: మొక్కలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ మొక్కల పెంపకంతో వాతావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీనేతలు పైల సుభాష్‌చంద్రబోస్, ఉమ్మిడి వెంకట్రావు, వాగు రమేష్, చింతల పాండవులు, పైల అయ్యప్ప పాల్గొన్నారు.

తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రత్తిపాడు రూరల్: మొక్కలు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో మంగళవారం స్థానిక బీజేపీ నేత ఊట వీరబాబు ఆధ్వర్యంలో అమ్మ పేరిక ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై ఇరువైపుల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. రామ్‌కుమార్ సమక్షంలో గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. బీజేపీ నాయకులు ఉమ్మిడి వెంకట్రావు, పైల బోస్, హరే రామ్, కర్రి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో మొక్క నాటుతున్న చిలుకూరి రామకుమార్

అమ్మ పేరుతో మొక్కల పెంపకం

తుని: భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో మొక్కలను నాటుతున్నామని బీజేపీ తుని నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం తుని పట్టణ, తొండంగి, కోటనందూరు మండలాల పరిధిలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 6 వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బీజేపీ నాయకులు నాగేశ్వరరావు, కొయ్యా వీర శ్రీను బాబు, ఆకెళ్ల శాస్త్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

రౌతులపూడి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి పిలుపు మేరకు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని అమ్మ పేరుతో మొక్క కార్యక్రమాన్ని మంగళవారం ఆయన రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ వారి అమ్మ పేరిట ఒక్క మొక్క నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైల సుభాష్‌చంద్రబోస్, ఉమ్మిడి వెంకటరావు, ప్రధానోపాధ్యయుడు కోళ్ల రాంబాబు పాల్గొన్నారు.

శివాజీ సేవలు ఎనలేనివి

తుని: మున్సిపల్ ఉద్యోగిగా కౌముది సంస్థ నిర్వహణలో కుసనం శివాజీ అందించిన సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం తుని క్షత్రియ పరిషత్ ఫంక్షన్ భవనంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి పదవి విరమణ చేసిన శివాజీ దంపతులను ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి బాబూశ్రీ శివాజీ దంపతులను పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఉద్యోగ నిర్వహణతో పాటు సామాజిక సేవలు అందించిన ఆయన విశ్రాంతి జీవితం ప్రశాంతంగా కొనసాగాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే రాజా ఆశోక్‌బాబు, బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, మాజీ కమిషనర్ సాయికుమార్, పురపాలక సంఘం ఉద్యోగులు కృష్ణమోహన్, రంగారావు, రమణారావు పాల్గొన్నారు.



మున్సిపల్ ఉద్యోగి శివాజీ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

బాల్యవివాహాలను అరికట్టాలి

కిర్లంపూడి: అభం శుభం తెలియని చిన్నారులకు బాల్యవివాహాలు చేసి వారి స్వేచ్ఛను హరించడం నేరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. మహిళాభివృద్ధి, బాలల పరిరక్షణ విభాగం, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిర్లంపూడిలోని వెలుగు కార్యాలయం వద్ద అతిసార వ్యాధి, బాల్యవిహాల నిర్మూలనపై కళాజాత ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే పోక్సో చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. చిన్నవయసులోనే వివాహం చేయడం వల్ల గర్భస్రావం, మాతాశిశు మరణాలు, అంగవైకల్యం, రక్తహీనత వంటి అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. చిన్నారులను చక్కగా చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని తల్లిదండ్రులను కోరారు. మీ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098 ఉచిత హెల్ప్‌లైన్ లేదా 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అతిసార వ్యాధి, బాల్యవిహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సలర్ బి.దుర్గారాణి, ఏంఈఓలు టి.జోషఫ్. ఎం.చిన్నారావు, సూపర్‌వైజర్స్ బూసమ్మ, సునీత, అంగన్‌వడీ, ఆశలు, పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.



బాల్యవివాహాల నిర్మూలనపై కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం

డయేరియా మహమ్మారిని తరిమికొట్టండి



కోటనందూరులో మానవహారంగా ఏర్పడి డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది

కోటనందూరు: ప్రాణాంతకమైన డయేరియా మహమ్మారిని తరిమి కొట్టాలని పంచాయతీ విస్తరణాధికారి జీ అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కోటనందూరులో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండు సెంటర్లో వైద్య ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది మానవహారంగా ఏర్పడి డయేరియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీవీబీ శాస్త్రి ట్రస్టు భూములకు కౌలువేలం



తహసీల్దార్ కార్యాలయంలో శాస్త్రి ట్రస్టు భూములకు కౌలువేలం నిర్వహిస్తున్న అధికారులు

గోకవరం: గోకవరంలో పీవీబీ శాస్త్రి ట్రస్టు రాజమహేంద్రవరం జిల్లా ఆస్పత్రికి దానం చేసిన సుమారు 10.50 ఎకరాల భూమికి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కౌలు వేలం నిర్వహించారు. తహసీల్దార్ హేమకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రైతులు వేలంలో పాల్గొన్నారు. యర్రంశెట్టి సత్యనారాయణ 2.57 ఎకరాలు, ఇనకోటి నాగేశ్వరరావు సుమారు 3.5 ఎకరాలు, ఇనకోటి విజయ్ 3.975 ఎకరాలను ధరావత్తు సొమ్ము చెల్లించి పాట దక్కించుకున్నారని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రజని తదితరులు పాల్గొన్నారు.

99 శాతం పెన్షన్ల పంపిణీ

తుని రూరల్: మండలంలో 99.13 శాతం మందికి సామాజిక పింఛన్లు అందించినట్టు ఎంపీడీఓ పి.రవి కుమార్ మంగళవారం తెలిపారు. మొదటి రోజు 98 శాతం మందికి, రెండవ రోజు 1.13 (మొత్తం 99.13 శాతం) మందికి అందించినట్టు పేర్కొన్నారు. కేఓ. మల్లవరం, రాజుపేట సచివాలయాల పరిధిలో వందశాతం మందికి పింఛన్లు అందించామన్నారు. 17 సచివాలయాల పరిధిలో 99 శాతానికిపైగా అందించామన్నారు. ఎనిమిది సచివాలయాల పరిధిలో 99 శాతం వరకు పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు తెలిపారు. మండలంలో మొత్తం 12405 మంది లబ్ధిదారులు ఉండగా 12,297 మందికి రూ.8.25 కోట్లు నగదును సచివాలయాల సిబ్బంది పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ రవికుమార్ వివరించారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

తుని: నీట్ పరీక్షా పత్రాలు లీకేజీని నిరసిస్తూ దేశవ్యాప్తంగా 4న నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము మంగళవారం కోరారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో విఫలమైందన్నారు. ఈ నెల 4న నిర్వహించే బంద్‌కు అన్ని విద్యాసంస్థలు సహకరించాలని కోరారు.

4న దేశవ్యాప్త బంద్

గండేపల్లి: ఈనెల 4న నిర్వహించనున్న దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘం సభ్యులు మంగళవారం గండేపల్లి ఎంఈఓ కేహెచ్ నాయక్‌కు విద్యార్థి సంఘం పిలుపు మేరకు వినతపత్రం అందజేశారు. నీట్, నెట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, ఎన్టీఏను రద్దుచేసి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, దేశవ్యాప్త పాఠశాలలు మూసివేతను ఆపాలని, విభజన చట్టంలో ఏపీకి కేంద్రం ఇస్తానన్న 11 జాతీయ విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘ నాయకులు, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

బెట్టింగులతో భవిత బేజారు

కాకినాడ రూరల్: ఒకప్పుడు నగరాలకు పరిమితమైన బెట్టింగ్‌ల సంస్కృతి నేడు పల్లెలకు పాకిందని, బెట్టింగ్‌లతో యువతకు ప్రాణ సంకటంగా మారుతోందని, చాలా మంది అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ తొలుత సరదాగా బెట్టింగ్‌లు మొదలు పెట్టి కాస్త డబ్బులు రాగానే ఆశ పెరిగి ఉన్నదంతా ధారపోసి నష్టపోతున్నారన్నారు. కొందరు అప్పులు చేసి బెట్టింగ్‌లకు పాల్పడి ప్రాణాల పైకి తెచ్చుకుంటున్నారన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని బెట్టింగ్‌లు పాల్పడే యువత చదువుల్లో కూడా వెనకపడుతున్నారని, దీనిని అరికట్టేందుకు కఠినమైన చట్టాలను అమలులోకి తీసుకురావలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ముంబై పోలీసుల గాలింపు

ప్రత్తిపాడు: మానవ అక్రమ రవాణా కేసులో నిందితురాలి కోసం ముంబై పోలీసులు సోమవారం రాత్రి నుంచి ప్రత్తిపాడులో ముమ్మరంగా గాలిస్తున్నారు. ముంబై కంజుమోరియా పోలీస్ స్టేషన్‌లో మానవ అక్రమ రవాణా కేసు నమోదైంది. ఈ కేసులో ప్రత్తిపాడు రాజుగారి వీధికి చెందిన ఓ మహిళ ప్రమేయంతో ఏడాది లోపు వయసున్న బాలుడిని విక్రయించినట్టు సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మహారాష్ట్రలోని కొందరు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న టి.మంగతాయారు కోసం కంజుమోరియా సీఐ ఆధ్వర్యంలో నలుగురు మహారాష్ట్ర పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితురాలి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. మానవ అక్రమ రవాణాపై ముంబై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు ధ్రువీకరించారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

శంఖవరం: గ్రామంలోని రేషన్ దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎంఎస్ఓ వీరాస్వామి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ సందర్భంగా ఒకటో షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 9,250 కేజీల బియ్యం గుర్తించారు. మూడో షాపులో 12.5 కేజీలు పంచదార తక్కువ ఉన్నట్లు నిర్ధారించారు. ఆయా దుకాణాల యాజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. దాడులలో విజిలెన్స్ ఎస్సై జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.